కాప్రా చెరువు సందర్శన



ఎంపీ ఈటల రాజేందర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం కాప్రా చెరువును పరిశీలించారు. స్థానికుల వినతి మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కాప్రా చెరువు వద్దకు చేరుకున్న ఎంపీ ఈటల చెరువును పరిశీలించారు. చెరువు పరిస్థితి, సమస్యలను ఎంపీకి ఎమ్మెల్యే వివరించారు. చెరువును పరిరక్షించి, అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

రూ.70 లక్షలతో సీసీరోడ్డు పనులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్ ఎస్సీబస్తీ, ఎస్వీనగర్ కాలనీలో సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. గురువారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎలిఫెంట్ సర్కిల్ కూడలి వద్ద రూ.1,13,00,000లతో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి తదితరులున్నారు.

నాచారం ఇన్‌స్పెక్టర్‌గా కొత్తపల్లి ధనుంజయ



మల్లాపూర్: నాచారం ఇన్‌స్పెక్టర్‌గా కొత్తపల్లి ధనుంజయ బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన రాచకొండ సీసీ ఆర్‌బీ విభాగం నుంచి బదిలీపై నాచారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. నాచారం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రుద్వీర్‌కుమార్‌ను కుషాయిగూడ ట్రాఫిక్–2 ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ.. సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆపరేషన్ సింధూర్'పై వ్యాసరచన పోటీలు

మల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యులు బోదాసు మాధవి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆపరేషన్ సింధూర్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర మహిళామోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. బీజేపీ మహిళా నాయకురాలు నిర్మల, సబిత తదితరులున్నారు.

ఆకట్టుకున్న 'లెన్జ్‌కేప్' పాటో ప్రదర్శన

అల్వాల్: లయోలా అకాడమీ బీఏ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'లెన్జ్‌కేప్' పేరుతో వార్షిక పొటోగ్రఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రేవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎన్‌బీ.బాబు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పొటోగ్రాఫర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బండి వి.రమణ హాజరై ఫారెస్ట్ ఫ్లవర్స్, 'ఏ పొటో డాక్యుమెంటరీ ఆన్ అరకు ట్రైబ్స్' అనే పొటో డాక్యుమెంటరీని ప్ర దర్శించారు. పొటోగ్రాఫర్, డిజైనర్ హరిప్రియ వంగరు హాజరై ఎంబాడీడ్ ఎక్స్‌పీరియెన్సెస్ అనే ఆలోచనాత్మక సెషన్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రేవరెండ్ ఫాదర్ పీటర్, ఐక్యుఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రామా, డీన్ ఆఫ్ ఆర్ట్స్ డాక్టర్ స్వరలిపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద సమస్య తీరెదెప్పుడు ?

జలమయమైన రహదారులు, ట్రాఫిక్‌కు అంతరాయం

- ప్రతి ఏటా ముంపు సమస్యతో అవస్థలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న బాధితులు



మిర్జాల్‌గూడ వెంకటాద్రినగర్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీరు (ఫైల్)

గౌతంనగర్: ప్రతి ఏటా వర్షాకాలంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. పలు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి సంబంధిత యంత్రాంగం పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ప్రభుత్వాలు మారినా పరిష్కారమేది.. ?

దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్న వివిధ ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్న ప్రతిఏటా వరద ముంపు సమస్య పరిష్కారం కావడంలేదని గౌతంనగర్ డివిజన్‌లోని అన్నపూర్ణ సొసైటీ, గోపాల్‌నగర్, జ్యోతినగర్, మిర్జాల్‌గూడ, చిన్మయ్‌మార్గ్, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజశ్రీనివాసనగర్ కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి అన్ని పన్నులతో పాటు ఎన్నికల్లో ఓటుహక్కు సైతం వినియోగించుకుంటున్నామని తెలిపారు.

విజృంభిస్తున్న వ్యాధులు

ఈసారి కురుస్తున్న వర్షాలకు న్యూ, అండ్ ఓల్డ్ మిర్జాల్‌గూడ కాలనీలతో పాటు పరిసరాల కాలనీల ప్రజలు వయస్సుతో సంబంధం లేకుండా సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో అవస్థలు పడుతున్నారు.

◆ చిన్నపాటి వర్షానికి మర్జాల్‌గూడ, చిన్మయ్‌మార్గ్, వెంకటాద్రినగర్, అన్నపూర్ణ సొసైటీ, రాజానగర్, జ్యోతినగర్, రాజశ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి మిర్జాల్‌గూడ పరిసర ప్రాంతాల రోడ్లు నీటమునిగాయి. భూగర్భ డ్రైనేజీలు పొంగి పొర్లడంతో దుర్వాసన వెదజల్లుతోంది. బుధవారం హైడ్రా సిబ్బంది వచ్చి భూగర్భ డ్రైనేజీలు శుభ్రం చేశాయి.

ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నాం



40 ఏళ్ల నుంచి మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్ ప్రాంతంలో నివసిస్తున్నాం. వర్షాకాలంలో వరదనీరు, మురుగుతో అనారోగ్యాలపాలవుతున్నాం. వరద సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– కొమురమ్మ, స్థానికురాలు

రోడ్డును విస్తరించాలి



మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్‌లో దశాబ్దకాలంగా నెలకొన్న ముంపు సమస్యకు పరిష్కారం కావాలంటే హుడామాస్టర్ ప్లాన్ ప్రకారం 66 అడుగుల రోడ్డును విస్తరించాలి. అధికారులు రోడ్డు ఆక్రమణలను గుర్తించాలి. 66 అడుగులు కాకున్నా కనీసం 46 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టాలి. వరదనీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

– శ్రీరామ్‌యాదవ్, మిర్జాల్‌గూడ

పోలీసుశాఖ సేవలపై అవగాహన



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించిన పోలీసులు

కుషాయిగూడ: పోలీసుశాఖ సేవలు, చట్టాలపై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కంపెనీ ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, షీ టీమ్స్, సైబర్ నేరాలు వంటి పలు అంశాలను మహిళలకు వివరించారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. నల్గొండకు చెందిన జాగృతి పోలీస్ కల్చరల్ టీం సభ్యులు పాటలతో మహిళల్లో ఉత్తేజం నింపి చట్టాలపై అవగాహన పెంచారు. చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ బృందం ప్రతినిధులు షారన్, సవిత తదితరులున్నారు.

భగాయత్‌లో స్టేట్ మినీ బ్యాడ్మింటన్ పోటీలు



ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఉప్పల్: యోనెక్స్– సన్‌రైజ్ 4వ తెలంగాణ స్టేట్ మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్– 2025 పోటీలను గురువారం మేడ్చల్‌జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు అన్ని విధాలుగా క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ టోర్నమెంట్ 21వరకు కొనసాగుతాయని వివరించారు. రంగారావు, యూవీఎస్‌బాబు, అకాడమీ నిర్వాహకులు విక్రాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరూ వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారే !

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో గోనె సంచిలో లభ్యమైన మహిళ మృతదేహం కేసులో మృతురాలు, నిందితుడు ఇద్దరూ వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారిగా పోలీసుల విచారణలో తెలిసింది. బతుకుదెరువు కోసం వచ్చి నగరంలోని నానక్‌రామ్‌గూడ, నార్సింగి ప్రాంతాల్లో లేబర్‌గా పనిచేసేవారు. ఈ క్రమంలో పరిచయమైన వారు కలిసి జీవించేవారని సమాచారం. పోలీసుల దర్యాప్తులో మృతురాలు ప్రమీల, నిందితుడు సంజయ్‌గా గుర్తించారు. మృతురాలు వివాహిత ఇద్దరు సంతానం. కాగా ఆమె భర్తను వదిలేసి ఇక్కడ కూలీ పనిచేసుకునేది. నిందితుడితో ఏర్పడిన పరిచయం కాస్తా.. అక్రమ సంబంధానికి దారితీసింది. ఇద్దరి మధ్య ఏర్పడిన గొడవల కారణంగానే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధుల మంజూరు

ఉప్పల్: డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.12 కోట్ల నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి అన్నారు. కాలనీలు, బస్తీల్లో సీసీరోడ్లు, మురుగు నీటివ్యవస్థ ఆధునీకరణ, అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం, సీవరేజ్ లైన్ల అభివృద్ధి తదితర పనులకు నిధులు మంజూరయ్యాయని, దశలవారీగా నిధులను వినియోగించనున్నట్లు ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: రూ.70 లక్షలతో చిలుకానగర్ డివిజన్‌లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను గురవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్యాంక్ కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ పైపులైన్ పనులను పరిశీలించిన ఆమె పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. స్థానికులు, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కాప్రా: వైఎస్సార్‌సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తెలంగాణ వైఎస్సార్‌సీపీ నేత పడాల శ్రీకాంత్ కలిశారు. గురువారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న హన్స్‌రాజ్ గంగారాం అహిర్, వేదికపై ప్రజాప్రతినిధులు

మల్కాజిగిరి: సమాజంలో గుర్తింపు రావాలంటే బీసీలు చైతన్యవంతులు కావాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్ అన్నారు. గురువారం ప్రశాంత్‌నగర్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బీపీ మండల్ 107వ జయంతోత్సవాలు దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు చట్టబద్ధత ఉండేదని మోదీ ప్రధాని అయిన తర్వాత బీసీ కార్పొరేషన్‌కు చట్టబద్ధత వచ్చిందన్నారు. రిజర్వేషన్ల ఫలాలు దక్కాలంటే ఐకమత్యంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీ వాత్సవలు మాట్లాడారు. కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, యూనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీనాక్షి, చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి బీవీఎస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కోశాధికారి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: ఎస్‌ఆర్‌ఐ కాలనీవాసులకు గతంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తున్నానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆయన రూ.56 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ మాట్లాడుతూ.. తొలివిడతలో భాగంగా ఇప్పటికే అంతర్గత ప్రధానరోడ్డు నిర్మించానని, రెండో విడతలో ఈ రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నేతలు నాగేశ్వ, పవన్, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీహరి, సంతోష్‌చారి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మిర్జాల్‌గూడలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. గురువారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడలో రూ. 10 లక్షలతో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె సర్కిల్ ఏఈ దివ్యజ్యోతితో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ఎమ్మెల్యే సహకారంతో మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, భైరు అనీల్, నర్సింగ్‌రావు, బిక్షపతి, నగేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, మర్రి శ్రీను, సిద్దిరాములు, కిట్టు, కన్న, భాను, ఎస్వీఆర్ వెంకట్, హబీబ్, రాజా, అశోక్ తదితరులున్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



రోడ్డు పనుల శంకుస్థాపనలో అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీలో రూ.45లక్షలతో గురువారం సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలికవసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉప్పల్ డిగ్రీ కళాశాలలో గాంధీ విగ్రహావిష్కరణ



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

ఉప్పల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నేడు ఉదయం 10 గంటలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్యకుమార్ చేతుల మీదుగా గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయకుమార్ ప్రకటించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 'జాతీయ కార్యశాల' వాల్‌పోస్టర్‌ను కళాశాల విద్యాసంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ బాలభాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులచే 'బాపు బాట' పేరుతో ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

'ఏఐబీఎస్ఎస్' కాప్రా మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్



కుషాయిగూడ: ఆల్ ఇండియా బంజార సేవాసంఘం కాప్రా మండల అధ్యక్షుడిగా కుషాయిగూడకు చెందిన చంద్రశేఖర్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దీరావత్ శ్రీనివాస్‌నాయక్ ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన బంజార నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బంజారాల అభ్యున్నతికి తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

భారీ వర్షం.. కాలనీలు జలమయం !

తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు



నర్సింహారెడ్డినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద..



మౌలాలిలోని ఓ ఇంట్లో నిలిచిన వరద నీరు

మల్కాజిగిరి: గత ఐదురోజులుగా కురుస్తున్న ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మల్కాజిగిరిలో గత రాత్రి కురిసిన వర్షానికి చాలా కాలనీలు జలమయమయ్యాయి. అనేక చోట్ల వరదనీరు రోడ్లపైనే నిలిచిపోయింది. ఆర్‌కేనగర్‌లో చెట్టు విరిగి పడటంతో హార్టీకల్చర్ విభాగం వారు తొలగించారు. విష్ణుపురికాలనీ నాలాల్లో నీరు వెళ్లకుండా ఉండటంతో హైడ్రా సిబ్బంది తొలగించారు. గురువారం సాయంత్రం కురిసిన ఆకస్మిక వర్షానికి ఓల్డ్ మల్కాజిగిరి నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద భారీగా నీరు నిలిచిపోయింది. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ పరిశీలించి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. దుర్గానగర్, పటేల్‌నగర్ తదితర కాలనీల్లో వరదనీరు నిలిచింది.

మౌలాలి: గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మౌలాలి డివిజన్ పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మౌలాలి, సాదుల్లానగర్, భరత్‌నగర్, షఫీనగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరుచేరడంతో అవస్థలు పడ్డామని ఆయా కాలనీల ప్రజలు మండిపడుతున్నారు.

వరద బీభత్సం..

కాప్రా: నగరంలో కురిసిన వర్షానికి కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో రోడ్లు జలమయమయ్యాయి. ఎగువ కాలనీ నుంచి వచ్చే నీటి ప్రవాహంతో డ్రైనేజీలు ఉప్పొంగి రోడ్లపై వరద బీభత్సం నెలకొంది. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి గురువారం ఉదయం వరకు నీటి ప్రవాహం కొనసాగింది. అటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పద్మశాలి టౌన్‌షిప్ వద్ద వరద ప్రవాహం

పిల్లలకు దేశభక్తిని నేర్పించాలి

ఎంపీ ఈటల రాజేందర్



నేతాజీ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: మనం మన పిల్లలకు వారసత్వంగా ఇవ్వాల్సింది.. ఆస్తులే కాదు.. విలువలతో పాటు దేశభక్తిని నేర్పాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. గురువారం కాప్రా సర్కిల్‌లో పర్యటించిన ఎంపీ ఈటల నేతాజీనగర్ పార్క్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని ఘటనలు చూస్తుంటే మనల్ని కలిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'కన్నతల్లిదండ్రులు, కడుపున పుట్టిన పిల్లలు, భర్తభార్యను, భార్యభర్తను చంపుతున్నారన్నారు. అవి ఎక్కడో..? జరుగుతున్నాయనుకుంటే పొరపాటే.. మనచుట్టూ ప్రమాదం పొంచి ఉందని, అందుకే మనపిల్లలను జాగ్రత్తగా పెంచాలని' సూచించారు.

◆ నేతాజీనగర్‌లో పార్క్ చిన్నదే.. అయినా గొప్ప మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తరాలకు ఓ మంచి సందేశం ఇచ్చారని తెలిపారు. మహనీయుల విగ్రహాలు పెట్టి, జయంతి వేడుకలు, వర్ధంతులు నిర్వహించి ఓ పూలదండ వేయడం కోసం కాదని, వారి చరిత్ర భావితరాలకు అందించడం కోసమన్నారు. సెప్టెంబర్ 17న మనం ఎగురవేసుకున్న జాతీయజెండా తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తు చేసిందని చెప్పారు. దేశంతో పాటు మనకు స్వాతంత్ర్యం రాలేదని, అందుకోసం మన పూర్వీకులు పడ్డకష్టం, ప్రాణత్యాగం భావి తరాలకు అందించడమే తెలంగాణ విమోచన దినోత్సవ లక్ష్యమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం లక్షలమంది పోరాటం, త్యాగాలు గుర్తుచేసుకుంటే రోమాలు నిక్కపొడుస్తాయన్నారు.

నేతాజీ గొప్ప మేధావి..

నేతాజీ సుభాష్ చంద్రబోస్ గొప్ప మేధావి అని, ఆనాడే ఇప్పటి ఐఏఎస్ లాంటి(ఐసీఎస్)ను పూర్తి చేశారన్నారు. ఆయన ప్రాణం తన కోసం కాదని భరతజాతి విముక్తి కోసమని, భారతమాత సంకెళ్లు తెంచడం కోసమేనని పోరాడారని గుర్తు చేశారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు మనందరం కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య భారతావని సాధన దిశగా నేతాజీ సాహసోపేత అడుగులు వేశారని గుర్తు చేశారు. గొప్ప జాతీయవాది, దూరదృష్టి కలిగిన నేతాజీ ఆశయాలు, త్యాగాలు దేశవాసులకు ఎప్పటికీ స్ఫూర్తిని ఇస్తాయన్నారు. ప్రతిరోజూ ఎంపీ ఈటల రాజేందర్ ప్రజల మధ్యే ఉంటున్నారని, దేశంలో అతి ఎక్కువ పర్యటనలు చేస్తున్న ఎంపీగా ఆయన మొదటిస్థానంలో నిలుస్తారని కొనియాడారు. ఉప్పల్ నియోజకవర్గానికి నిధులు కూడా తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, స్థానిక నేతలు భైరి నవీన్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మధుకర్‌రెడ్డి, నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.